గోముఖి...

'హ్యాదయిని'

సంధ్యాసమయం. టంగ్ - టంగ్ - టంగ్ - టంగ్ - టంగ్ - అని గడియారం గంటలుకొట్టింది. మావారికి సినిమాకు వెళ్లాలని సంకల్పం కలిగింది. ఆదరాబాదరాగా నాదగ్గరకు వచ్చి, 'సరళా! ఊళ్లో శాంతారాం తీసిన డాక్టరు కోట్నీస్ ఆడుతున్నదట. వెడదాం పద,' అంటూ నన్ను తొందరపెట్టారు. మావారి కలవాటే - ఏదైనా సంకల్పం హఠాత్తుగా కలుగుతుంది! సంకల్పించిన వెంటనే అది నెరవేరాలి! దాంతో నేనొకటిచేయబోయి యింకొకటిచేస్తూంటా. ఏంటీ ఆలస్యం-అని వారి అరుపులు! పదినిమిషాల్లో తయారయ్యా. వారూ తయ్యారయారు. ఈ జంట వెళుతున్నది సినిమాకు అని చూచేవారికిట్టే తట్టేటట్లు.

రిక్షానుంచి, ఆళాథియేటరుదగ్గర దిగాం, ఆట మొదలెట్టలేదు. కాని అక్కడ ఆడుతున్నది - ఆద్మీ. మావారు, 'సరళా!' 'కోట్నీస్' లేదు. 'ఆద్మీ' ఆడుతుంది. ఇదైనా శాంతారాం కళాఖండమే. దీనికథ రాసింది ఒక ఆంధ్రుడు', అని ఒక్కగుక్కలో చెప్పారు.

'మీ యిష్టం;' అన్నాను కొంత విచారంతో. ఎందుకంటే 'కోట్నీస్' చిత్రాన్నిగూర్చి ప్రసిద్ధ పత్రికలు, అపుడపుడు మావారు పలికిన ప్రశంసావాక్యాలు గుర్తుండి, ఆఫిల్మ్ కాదే అని మనసు చివుక్కుమన్నందున.

మావారు గమనించి, 'పోనీ అది వచ్చినపుడే వద్దాం' అని తటపటాయించారు. 'పోనీలే వెళదాం పదండి' అన్నాను నేను. 'ఇంటికా సినిమాకా!' అన్నారు వారు. 'మీయిష్టం' అన్నాను మళ్లీ. 'అయితే యింటికే వెళదాముపద. కోట్నీస్‌వస్తే మళ్లీదానికి డబ్బు లెక్కడవస్తాయి?' అని తన 100 రూ. ల పంతులుద్యోగం స్మృతికి వచ్చి వెనక్కు మళ్లారు నా చేతిని పట్టుకొని.

రిక్షా యెక్కి వెళదామా, నడచి వెళదామా, అని ఆలోచనలో పడ్డా మిద్దరం. థియేటరునుంచి బయటికి వస్తూ ఒక కారు మా ప్రక్కనే ఆగింద. కారులోంచి తల బయటపెట్టి మా వారిని ప్రశ్నించాడు కామదాసు - 'ఏమండీ! సినిమాకు వచ్చి తిరిగి వెళుతున్నారేం! సినిమా చూడరా?' అని.

కామదాసు మా యెదురింటివాడే.

డాక్టరు P. కామదాసు M. B. B. S.,
EYE & E. N. T. స్పెషలిస్టు

అని అతగాడి యింటితలుపుమీద ఓ చిన్న బోర్డుంటుంది. రూపురేఖలిలావుంటయి: బట్టతల, గుబురైన కనుబొమ్మలు చంద్రహాసలోని దుష్టబుద్ధిని గుర్తుకు తెస్తుంటయి. పొట్టిమెడ. కొంచెం గూని పళ్ళికిలించినపుడు తొంగిచూస్తూండే బంగారం పన్నులు రెండు. నిత్యం షేవింగుచేసివుండే గడ్డం. చామనచాయ, స్థూలశరీరమే. అధునాతన ఆంగ్లేయ ఫ్యాషనులో సూటు, బూటు, హేటు, సైకిలు వాహనం. వయసుదాదాపు 40. ఇద్దరు బిడ్డల తండ్రి. అపరిచితులకు చూచీచూడటంతో సంపాదనపరుడుగా కనుపిచ్చేమనిషి. నిజానికతడు ఆంధ్రుడుగాడు, ఏ కొంకిణీజాతికో చెందినవాడు.

డాక్టరు కామదాసుకు మాకు అప్పటికి కించిత్తయినా పరిచయంలేదు. చొరవచేసుకొని ఆనాడెందులకు పలకరించాడో మరి!

మావారు అతగాని మాటల్లో సినిమాకు ఆహ్వానిస్తున్నాడన్న అర్థంతీసుకొని. 'ఎబ్బె,—డాక్టరు కోట్నీస్ ఆడుతుందని వచ్చామండి. అదిలేకపోవటంచేత తిరిగి పోదామనుకుంటున్నాము,' అని చిర్నగవుతో ప్రత్యుత్తరించారు.

'ఎందుకండీ, ఆద్మీకూడా చాల మంచి చిత్ర

మండి!' అన్నాడు కామదాసు, మావారికి హిందీ సినిమా ప్రపంచం సుపరిచితమన్న సంగతి రవ్వంతయినా తెలియక.

'అలాగాండి!' అన్నారు మావారు.

'రండి, నేను మిమ్మల్ని లోనికి తీసుకెళతాను' అన్నాడు కామదాసు హుందాతనంతో.

'స...రే...పదండి' అన్నారు మావారు దరహాసంతో.

కారుదిగి, 'సినిమా వదిలేవేళకు రావోయి' అని కారుడ్రైవరు కాదేశించాడు కామదాసు; ముగ్గురము థియేటరులోనికి నడచాము. అశానుహాలు ఆ వూరికల్లా చాలా అందమయిన థియేటరు. కామదాసు ముందు నడుస్తుంటే వెనక మేమిద్దరం బాల్కనీమెట్లెక్కి వెళ్ళి లోనమెత్తని కుషన్ కుర్చీలలో కూర్చున్నాం. ఆట మొదలెట్టడానికింకా టైముంది.

'బాయ్!' అని కేకవేశాడు కామదాసు.

మా వారు నావైపు చూశారు, - అతగాడేదో తెప్పించబోతున్నాడన్నట్లు.

బాయ్ - కుర్రవాడుగాదు - గడ్డంమీసాలున్నవాడే ఒకడువచ్చి వినయంగా నిలబడ్డాడు.

'మూడుప్లేట్లు చాక్లెట్లు,బిస్కట్లు, తీసుకరా?-' అని కామదాసు పిల్లజమీందారులా ఆజ్ఞాపించాడు.

మావారు,''ఇపుడెందుకండవన్ని-మేము భోంచేసే వచ్చాము,'' అన్నారు

'మీరు సంకోచించకండి, ఈ మాత్రం లైట్ టిఫిన్లకు జడిస్తే ఎలా?' నవ్వుతూ అన్నాడు కామదాసు.

బాయ్ ట్రేలో ఆర్డరిచ్చిన పదార్థములతో తయారయ్యాడు. తినడం పూర్తయింది. ఆపైకాఫీ, కిల్లీకూడ. పదార్థములమీద క్రమంగా అసామాన్యమైన ఉపన్యాసం చెప్పుకపోతున్నాడు కామదాసు. ఛలోక్తి మాట్లాడినానుకొన్నప్పుడు ఓరచూపుతో చిర్నవ్వుతో నావైపుచూశాడు. లైట్లవెల్తురులో ముందరి బంగారపురేకుపళ్లు తళతళా మెరసినవి. సిగరెట్టుపెట్టె తీసి మావారి కందించాడు. వద్దంటూ మావారు స్వీకరించారు. తానొకటి తీసుకొని డాక్టరు అగ్నిహోత్రం చేయటంలో సహాయం చేశాడు.

మావారు సిగరెట్టు ముట్టించుకొని,'మీరు నిత్యాగ్నిహోత్రుల్లావుంది!' అని చలోక్తి విడచారు.

'అంతగా కాదండి, ఏదో రోజుకు నాలుగు పెట్టెలు దగ్ధంచేస్తాను!' అని ప్రతి ఛలోక్తి వచ్చింది కామదాసునుంచి.

సినిమా యెపుడో ప్రారంభమయింది. నేను సావధానంతో సినిమా చూడసాగాను. 'కాని, ఈ ఆద్మీకి వేసినతను సాహూ మోడక్ అనీ, అతని తొలిచిత్రాలు ఫలానివి, ప్రస్తుత చిత్రాలు ఫలానివీ, ఇపుడు మోడక్ చాలా స్థూలం అయ్యాడు, ఈ చిత్రంలో వేశ్యపాత్రధారిణి శాంతా హుబ్లీకర్ అనీ అనేక ప్రశంసా వాక్యావళితో ఒకటే సొదగా చెవిక్రింద ధ్వనిచేస్తున్నాడు చెవితెగిన నక్కలా ఆ కామదాసు. నాకు మా చెడ్డ చిరాకు వేసింది, పాడు సినిమా లేకపోతే పోయింది, యింటికి పోదామా అని మా వారిని రెండుమూడుసార్లు స్పృశించాను. వారు ఎక్కడా వుండని సహనభావంతోవుండి, 'సహించు సరళా' అన్నట్టు సంజ్ఞచేశారు.

'ఒక ప్రక్క సినిమా నడిచిపోతూన్నది, ఇంకొక ప్రక్క తనకీవూరిలోనున్న హోదా, తాను నెలకెంత సంపాదిస్తుంది, తానెంత ఖర్చుచేస్తుంది ఇత్యాది స్వవిషయాలు ఆయాచితంగానే ప్రశంసించుకపోతున్నాడు డాక్టరు కామదాసు. ఇంకా ఈ థియేటరు వాళ్లు మనకు ప్రియమిత్రులు. వారికి మనతో చాలా అవసరంపడుతూ వుంటుంది. అంచేత మన కీథియేటరులోకి ప్రవేశం ఎపుడుపడితే అపుడే. నోటికెట్ యెటె నీటైమ్ ఫర్ యెనీ పిక్చర్ ఆర్ డ్రామా,

అసలు ఈ వూరిలోవున్న థియేటర్లన్ని మన కిలాంటి స్వాగతాన్ని యిచ్చేవే!' అని దర్పం, దరహాసం చూపించాడు డాక్టరు.

సినిమా అయిపోయింది. బయటకు వచ్చేటప్పుడు నా వైపు రెండు మూడు సార్లు విషపూరితమయిన దృష్టులు - అతని ఉద్దేశంలో అమృత భరితమయిన విగా వుండొచ్చు - ఇరువదేండ్ల పడుచువాడిలా చూచాడు. ఏంటీ బిడ్డలతండ్రి యిలా చూస్తాడని పించింది.

థియేటరు బయట డాక్టరు కారు నిలబడివుంది. 'రండి కారెక్కి వెళదాము నేనూ ఇంటికే వస్తున్నాను.' అని కులాసాగా కోరాడు.

నా సంజ్ఞ ననుసరించి, 'ఫరవాలేదులెండి, మధ్య మాకు పనివుంది. మేము రిక్షాయెక్కి వెళతాం రేపు మిమ్మల్ని దర్శించుకొంటాను. సెలవు' — అన్నారు మావారు.

'అదేమిటండీ! మనమంతాకలసి కారులో వెళదామనుకొన్నానుగదా' అన్నాడు డాక్టరు తన ముఖం నిరాశా ప్రపూర్ణంగా.

'ఫర్వాలేదు. మీరు ఇప్పటికి చూపిన సౌహార్దమే ఎంతో ఘనమయింది. సెలవు!' అన్నారు మా వారు.

... రిక్షావాహనంపై యింటికిచేరాము సతీపతులిద్దరం.

'ఏం సరళా! ఈ నాటి సినిమాప్రోగ్రాము సినిమాలోని సంఘటనలాలేదూ?'

'అవునండి. ఇంత అవ్యాజమైన ప్రేమ, స్నేహం డాక్టరు కామదాసులో వున్నట్లు ఎప్పుడూ వెల్లడి కాలేదే?'

'పిల్లలమీద, బంట్రోతులమీద ఒకటేతీరుగా పొలిమేరకేకలు పెడుతుంటే, తీక్ష్ణమైన ఆ చూపుల వల్ల నేనెపుడూ అనుకోలేదు ఈతనిలో యింత సౌహార్దం దాగుందని!'

'అయినా, ఈ స్నేహం ఇంత త్వరలో ఆకాశపథం అందుకొందెందుకో?'

'అదే నాకూ విచిత్రంగావుంది. భర్తృహరి చెప్పిన మైత్రిసంబంధమైన పొద్దుటిపూట ఎండలోని నీడలు గుర్తువస్తున్నాయి. ఈ ఆకస్మిక ప్రాదుర్భావిత — ప్రగాఢమైత్రి అలాంటిదని నాకుతోస్తుంది!' అన్నారు మా వారు సమాస ప్రయోగంతో.

'నా కదే తట్టిందినుమండీ.'

'సరే. దీని పరిణామం ఎలా వుంటుందో చూస్తాంగా?'

♦ ♦ ♦

వసతయిన యిల్లుకోసం ఎదురుచూస్తున్న మాకు ఆ పేటలోనే మరొక వీధిలో మంచి యిల్లు దొరికింది; మే మా యింటికి మారాము.

కామదాసుకు మా వారికి మైత్రి హెచ్చింది. డాక్టరింటికి మా వారి రాకపోకలు ధారాళమయినయి. డాక్టరున్ను మా యింటికి అడపాదడపా రావటంపడింది. మా యింటిలో మావారెపుడుండేది, ఎపుడుండనిదీ, ఎంతమంది వుంటుంది మొదలయిన అనవసరమయిన ప్రశ్న పరంపరలకు ప్రత్యుత్తరాలు సేకరించాడట మావారి దగ్గరినుంచి డాక్టరు. ఎప్పుడూ స్వప్రకర్ష ప్రశంసేనట. Art of bordom లో డాక్టరేటు పొందదగినవాడట!

ఇంకొకవారంలో శాంత జ్ఞానేశ్వర్, పర్‌ఛాయీ ఆ డాక్టరూ మేమిద్దరం చూడటం సంభవమయింది. అవ్యక్తమయిన యే ఆశతో ఆ మహానుభావుడు మమ్మల్ని వూరకనే సినిమాకు తీసుకొనివెళుతున్నాడో నాకర్థంకాలేదు. ఆ సినిమా ప్రోగ్రాములు ఇలా వుండేవి — మావారు డా|| ఇంటికి వెళ్ళినపుడు ఈ రాత్రి సినిమాకు వెళదాము, సరిగా మీరు థియేటరు దగ్గరకు ఇన్ని గంటలకు రండి, నేను మీ కోసం థియేటరువద్ద ఎదురుచూస్తుంటా - అని ఆ డాక్టరు చెప్పటం, సరళా ఈ వేళ సినిమాప్రోగ్రాముందనడం, బయలుదేరడం ప్రప్రథమంలోని ఆతిథ్యం - చాక్లెట్లు,

బిస్కట్లు, కిళ్లీలు ఒక్కొక్కటే మటుమాయమయి పోయినవి. మావారు అతగాడు సిగరెట్లు దగ్ధపటలం చేయడ మెక్కువయింది; వాస్తవానికి మావారికి సిగరెట్ల అలవాటులేదు. థియేటరులోనే ఒక సంభాషణ మధ్యలో – 'మీ ధర్మపత్ని సుతులతో మా ఆవిడకు పరిచయం చేయండి. ఈ సినిమాలకంతా కలిసివస్తేనే బావుంటుందని నా ఉద్దేశం' – అని మావారు అభిషక్కుతో అన్నారు.

'మా ఆవిడ అరిస్టోక్రాటిక్ అండి. ఆవిడకు మనవలె సోషయాలిటి పనికిరాదు. మనం సినిమాలకు కలిసివెళుతున్నట్లు మా ఆవిడకు తెలియటంకూడ నాకిష్టంలేదు. అదిగాక నా ప్రిన్సిపిల్స్ ననుసరించి మా ఆవిడ గడపదాటి బయటికిరాదు.'

'దుర్మార్గుడు తన హృద్గతమయిన అసంస్కృతిని బహిర్గతంచేశాడు పొరపాటున. తన భార్య అయితే పరుని కంటబడకూడదు, పరాయివాని భార్య అయితే పదిమందితో కలసి తిరగాలన్నమాట,' అని లోలోన అనుకొన్నాను.

'అలాగాండి పోనీలే!' అన్నారు మావారు.

ఒకసారి ఆపాడు సిగరెట్లు అలవాటు లేకపోయినా దగ్ధంచేస్తున్నందువల్ల, అవి అయిపోగా స్నేహపూర్వకంగా ఒకపెట్టె తెమ్మని మావారికి డబ్బిచ్చి బయటకు పంపాడు ఆవైద్యశిఖామణి. ఆపై నాకు వినిపించేటట్లుగా - అప్యాయంగా - 'మీకు సినిమాలు బావుంటున్నాయా ?' - అని ప్రశ్నించాడు.

'నాతో భాషించడానికా మావారిని బయటికి పంపింది' అని తేలింది. ఎంతవ్యలీక మైత్రిని నెరపుతున్నాడు! ముక్తసరిగా సమాధానించాను - 'బాగానే వుంటున్నాయి,' అని.

... ఆ తర్వాత ... మాయింటికి అతగాడి బంట్రోతు కొన్ని మేగజైన్లు, కూరగాయలు, పండ్లు అడపాదడపా చేరవేయడం జరిగింది. అనుగ్రహాలు, ప్రసాదాలు ముమ్మరం అవుతున్న సంగతి గమనించి మావారు అన్నారు ఒకసారి - 'సరళా! వీడితరహా ఏదో అఘాయిత్యానికి ఒడిగట్టేటట్లుగా కనుపిస్తున్నది సుమా !'

ఒక యింగ్లీషు చిత్రం చూస్తున్నసమయం. మావారు సిగరెట్లకోసం బయటకు వెళ్లారు. అవకాశం చూసుకొని తానింతకుముందే భద్రంగావుంచిన కిళ్లీ ఒకటి నాకిస్తూ కొన్నిమాట లస్పష్టంగా పలికాడు కామదాసు 'రేపు ఉదయం 11 గం. కు మీ యింటికి వస్తా. నేనీకిళ్లీ మీకిచ్చినట్లు చెప్పకండి!' అన్న రెండు వాక్యాలు మాత్రం వినిపించినవి. వాడి వేడినిట్టూర్పుతోడి సంభాషణక్రమం - వాడు మావారు పరమ అమాయకుడనుకోటం నాకు నవ్వు తెప్పించింది. మహారసికుడుగా - కార్యసాధకుడుగా భావించుకొంటున్న వాడి నీచబుద్ధిపై నాకెంతో అసహ్యం వేసింది. అపుడేమీ మాట్లాడలేదు. అంతలో మా వారు వచ్చేశారుకూడా.

ఇంటికి చేరాక మావారికి సర్వం వెల్లడించాను. మా వారు నవ్వి, 'సరే, యీ భ్రష్టుడి తపస్సుఫలించే సుదినం రేపే అవుతుందిలే!' అన్నారు.

మరునాడు మా అన్నయ్యకూడ వచ్చాడా వేళ. బావమర్దుల మధ్య నాటి కార్యక్రమం ఆమూలాగ్రం చర్చింపబడింది. మావారు కాలేజీకి సెలవు పెట్టారు మా అన్నయ్య. మా వారు ఒక గదిలో నిశ్శబ్దంగా 11 గం. లు ఎపుడు అవుతుందా అని ఎదురుచూస్తూ వుండిపోయారు.

11 గంటలు కొట్టింది. సైకిలు బెల్ మ్రోగింది బయట. కామదాసు గడపదాటి 'ఏమండీఉన్నారా?' అని నవ్వుల పువ్వులతో లోన ప్రవేశించాడు.

నన్ను భయం - ప్రకంపనం చుట్టుముట్టినవి. మనసుదిట్టపర్చుకొన్నాను. నేను అలమరదగ్గరకువెళ్ళి పుస్తకాలు సర్దసాగాను. ఆవిషసర్పం సమీపానికి వచ్చి నాభుజంమీద చేయి వేస్తూ మెల్లగా మోహాలాపనలు మొదలెట్టాడు.

'మీవారు ఇంట్లో లేరనుకొంటాను'

'...............'

'మీ వారు వట్టి అమాయికులు సుమండీ! టీచర్లలో చాలమంది పుస్తకపండితులేనంటాను.'

'......' నేను కొంచెం పైదొలగాను.

ఆనర పిశాచాన్ని నామానం ఉత్సాహపరచింది కాబోలు.

'మీరు మా యింటి కెదురుగా వున్నపుడు ప్రతి ప్రొద్దున మా వాకిలివైపు చాలాసార్లు చూస్తూవుండేవారు. నేను గమనించాను. మీరునన్ను ప్రేమిస్తున్నారు గదూ!'

'నా మనసులో అనుకొన్నాను - నేనటుచూడటం ఎంత ముప్పు తెచ్చిపెట్టింది! — అని.'

నేను కొంచెంధైర్యం తెచ్చుకొని - 'చూసినంత మాత్రాన నేను మిమ్మల్ని...'

'ప్రేమిస్తున్నావు - అని మీ చూపులలోని అమాయికత్వం చెప్పింది-చెపుతూంది.' అన్నాడు ఆ ఆ రసిక చక్రవర్తి.

'మీరు నాకు తండ్రివంటివారు'

'వయసులో అంతేకావచ్చు. మేము డాక్టర్లము. మాకు ఎపుడూ యౌవ్వనమే!'

'చూడండి - నేను మిమ్మల్ని...'

'ప్రేమిస్తున్నావా గాడిదా!' ఫెళ్లుమని కామదాసు చెంపపగిలి ముందరిరెండు పండ్లు రాలినవి. యమభటుడిలా మా అన్నయ్య ప్రక్కనే ప్రత్యక్షమయియున్నాడు? చిర్నవ్వుతో మావారు - 'డాక్టరుగారా!' అన్నారు.

మా అన్నయ్య ఉగ్రరూపంతోనే, 'ఒహో డాక్టరా నమస్తే! నేనో డెంటిస్టును,' అని ఉపహసించాడు.

మెదడును చల్లబరచి
శిరోజములను నల్లబరచి
కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలక తైలము

వెల రు. 2

కేసరి-కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.